ముగిసిన శిక్షణ

మంచిర్యాలఅర్బన్: పంజాబ్ పటియాలలో నిర్వహిస్తున్న ఏక్‌భారత్ శ్రేష్ట భారత్(ఈబీఎస్‌బీ) ఎన్‌సీసీ క్యాంపు ముగిసింది. క్యాంపునకు మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు ఎన్‌సీసీ కేడెట్లు అనిల్‌కుమార్(బీఏ), అఖిల్(బీకాం), శివకుమార్ బీఎస్సీ(తృతీయ) హాజరయ్యారు. క్యాంపు శిక్షణ పూర్తి చేసుకుని వచ్చిన విద్యార్థులను సోమవారం మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, ఎన్‌సీసీ అధికారి తిరుపతి అభినందించారు.

విద్యార్థులకు అవగాహన

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అనాథ ఆశ్రమాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు జిల్లా బాలల సంరక్షణ శాఖ కమిటీ సభ్యులు సోమవారం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మంచిర్యాలలోని ఏకలవ్య ఆశ్రమ పాఠశాల, రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలోని అనాథాశ్రమం, నస్పూరులోని అభయం బాలల సంరక్షణ కేంద్రం, జన్నారంలోని మదర్ థెరిస్సా చిల్డ్రన్ హోం సందర్శించారు. జిల్లా కమిటీ చైర్‌పర్సన్ డీసీపీవో ఆనంద్, సభ్యులు డాక్టర్ అనిత, ఎన్జీవో సభ్యులు సత్యనారాయణ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వాహిద్, పీవోఐసీ సత్తయ్య పాల్గొన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.0 /25.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. పడమర దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

పుస్తకాలు చదివేలా తీర్చిదిద్దాలి



పుస్తక పఠనోత్సవంలో డీఈవో యాదయ్య

దండేపల్లి: ప్రతీ విద్యార్థి తెలుగు, హిందీ, ఇంగ్లిష్ ధారాళంగా చదివేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖాధికారి యాదయ్య అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జూలై 30 వరకు చేపట్టిన పుస్తక పఠనోత్స కార్యక్రమాన్ని సోమవారం రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనంతో విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్, సర్పంచ్ కల్యాణి, జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, చౌదరి, ఎంఈవో రవీందర్, నోడల్ అధికారి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం రెబ్బనపల్లి ఉన్నత పాఠశాలను డీఈవో యాదయ్య సందర్శించారు. విద్యార్థుల ప్రతిభ సామార్థ్యాలను పరిశీలించారు.

జిల్లాలో 11.8 మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆదివారం నుంచి సోమవారం వరకు 11.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మంచిర్యాల మండలంలో 31.9 మిల్లీమీటర్లు, నస్పూర్‌లో 20.8, వేమనపల్లిలో 19.6, జైపూర్‌లో 19.8, మందమర్రిలో 14.4, లక్సెట్టిపేటలో 16.8, హాజీపూర్‌లో 15.4, భీమినిలో 11.3, కోటపల్లిలో 10.4, దండేపల్లిలో 9.1, జన్నారంలో 8.1, కాసిపేటలో 5.1, నెన్నెలలో 5.8, చెన్నూర్‌లో 4.9, భీమారంలో 3.2, బెల్లంపల్లిలో 3.8, తాండూర్‌లో 1.9 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇప్పటివరకు జిల్లా సగటున సాధారణ వర్షపాతం 135.4 మిల్లీమీటర్లు కాగా 60 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 56 శాతం లోటు వర్షపాతం నెలకొంది.

50,783 మందికి రైతుబంధు

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సాగుకు ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు పెట్టుబడి సాయం మొదటి రోజు జిల్లాలో 50,783 మందికి రూ.14,64,14,825 రైతుల ఖాతాల్లో జమ అయ్యింది. గుంట నుంచి ఎకరన్నర భూమి కలిగి ఉన్న రైతులకు నగదు జమ చేశారు. రోజువారీగా పెంచుతూ 15 రోజుల వ్యవధిలో నగదు జమ చేయనున్నారు. గతంలో రైతుబంధు పొందిన రైతులతోపాటు కొత్త పాసుపుస్తకం అంది, బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు వివరాలు అందించిన రైతులు ఇప్పటివరకు 1,48,289 మంది ఉన్నారు. వీరికి రూ.167,50,11,704 ఖాతాలో జమ కానుంది.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు

మంచిర్యాలటౌన్: వర్షాలు కురుస్తుండడంతో గ్రామాలు, పట్టణాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతీ పీహెచ్‌సీ వారీగా ఎపెడమిక్(అంటువ్యాధుల) సెల్ ఏర్పాటు చేయాలని, వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజ యనిర్మల, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనిత, డీఎస్‌వో డాక్టర్ ఫయాజ్, డెమో బి.వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని కలిసిన డాక్టర్ రాజరమేష్



రాహుల్‌గాంధీతో డాక్టర్ రాజరమేష్

రామకృష్ణాపూర్: సింగరేణి వైద్యుడు డాక్టర్ రాజరమేష్ కాంగ్రెస్ పార్టీలో చేరడం ఖరారైంది. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన ఢిల్లీలో కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌ఖర్గేను కలిశారు. వచ్చే ఎన్నికలలో చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆశిస్తున్నారు. వచ్చే నెల 2న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగసభలో పొంగులేటితోపాటు కాంగ్రెస్ పార్టీలో చేరుతానని రాజరమేష్ తెలిపారు. పార్టీలో చేరేలోగానే సింగరేణి వైద్యవృత్తికి రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు.

వానొస్తే బురదమయం..!



సాక్షి ఫోకస్

చెన్నూర్ పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వెళ్లే దారి ఇదీ..

- మున్సిపాలిటీల్లో అంతర్గత రోడ్లు అధ్వానం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చెన్నూర్: జిల్లాలోని పలు మున్సిపాల్టీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. వానొస్తే బురదమయంగా మారి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షాలకు మురికి నీరంతా రోడ్లపై పారుతోంది. చినుకు పడితే రోడ్లు చిత్తడిగా మారి పలు కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పట్టణంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వైపు మట్టి రోడ్డు ఉంది. వర్షం పడినప్పుడు బురదగా మారుతుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అవస్థలు పడుతున్నారు. ఇందిరానగర్ కాలనీకి వెళ్లే దారిలో కల్వర్టు పూర్తి కాకపోవడంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఎస్‌పీవాడ, దుబ్బాగూడెంలకు వెళ్లే దారిలో సిమెంట్ రోడ్డు శిథిలావస్థకు చేరింది. దీంతో వర్షపు నీరు నిలిచి నడక నరకప్రాయంగా మారింది. గాంధీ చౌక్ నుంచి పద్మశాలి వీధికి వేళ్లే రోడ్డు మధ్యలో నీరు నిలుస్తోంది. పెద్దగూడెం, మారెమ్మవాడలలో రహదారుల పరిస్థితి దారుణంగా తయారైంది. వర్షాలకు బురదమయంగా మారుతున్న రోడ్లను గుర్తించి అధికారులు కొత్త రోడ్ల నిర్మాణాలకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గాంధీచౌక్-పద్మశాలి వాడ రహదారి పరిస్థితి

వర్షం పడితే గేటు వేయాల్సిందే..

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రం మంచిర్యాలలోని టూటౌన్ ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపర్చేందుకు రైల్వేస్టేషన్‌కు సమీపంలో నిర్మించిన రైల్వే అండర్‌బ్రిడ్జి చిన్నపాటి వర్షానికే గేటు వేయాల్సిన పరిస్థితి నెలకొంటోంది. వర్షపు నీరు అండర్‌బ్రిడ్జిలోకి చేరి వాహన రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. వర్షపు నీరు నిలిచి వాహనాలు ఇరువైపులా వెళ్లకుండా ఉండేందుకు గాను చెక్‌పోస్టు మాదిరిగా గేట్‌ను ఏర్పాటు చేశారు. గత ఏడాది వర్షాకాలం ముగిసే వరకు రైల్వే అండర్‌బ్రిడ్జిని పూర్తిగా మూసేయగా ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం కాగా, ఇప్పటికి వరద నీరు బయటకు వెళ్లేలా అధికారులు ఏర్పాట్లు చేయలేదు.



వర్షానికి అండర్‌బ్రిడ్జిలో నిలిచిన వరద నీరు(ఫైల్)

- డీఎఫ్‌వో కార్యాలయం వద్ద తాగునీటి ట్యాంకు చుట్టూ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. ఇటీవల కురుస్తున్న చిన్నపాటి వర్షాలకు బురదమయంగా మారుతుండగా అధికారులు పట్టించుకోవడం లేదు. అపరిశుభ్రంగా ఉన్న చోటనే ట్రాక్టర్లను నిలిపి తాగు నీటిని నింపుకొని వెళ్తున్నారు. తాగునీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రతపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



డీఎఫ్‌వో కార్యాలయం ట్యాంకు వద్ద అపరిశుభ్రత

అస్తవ్యస్తంగా కాలువలు



ప్రాణహిత కాలనీ మురికి కాలువలో పూడిక

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీలోని పలు కాలనీల్లో కాలువలు పూడికతో నిండి అస్తవ్యస్తంగా తయారయ్యాయి. వర్షాలు పడడంతోనే పూడికతో నిండిన కాలువల వల్ల నీరు రోడ్లపైకి, ఇళ్లలోకి చేరుతున్నాయి. ప్రాణిహితకాలనీ(షిర్కే)లో కాలువలకు అడ్డంగా కొంతమంది నిర్మించుకున్న అడ్డుగోడల వల్ల కాలువల్లో పూడిక తీయలేని పరిస్థితి నెలకొంది. పలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే బురదమయంగా తయారై సిబ్బందికి ఇబ్బంది తప్పడం లేదు. సింగరేణి, మున్సిపల్ అధికారులు సమష్టిగా కాలనీల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

- మందమర్రి మున్సిపాలిటీ పరిధిలో 24 వార్డులుండగా 16 వార్డులు మున్సిపాలిటీ, 18 వార్డులు సింగరేణి పరిధిలోకి వస్తాయి. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య పనుల నిర్వహణ కోసం 53 మంది మాత్రమే ఉన్నారు. విద్యానగర్, శ్రీపతినగర్, దీపక్ నగర్, మార్కెట్ ఏరియా, నార్లాపూర్, ఊరు మందమర్రి, ఎర్రగుటపల్లె తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉంది. కాలువల్లో పూడిక నిండింది, పలు కాలువల్లో తాగునీటి పైపులు అడ్డంగా ఉండడంతో మురికినీరు రోడ్లపైకి చేరుతోంది. మార్కెట్ ఏరియాలో కాలువలపై దుకాణాల యజమానులు స్లాబు వేయడం వల్ల రోడ్డుపైనే వర్షం నీరు పారుతోంది. సింగరేణి కాలనీల్లో క్వార్టర్ల వెనుక గల్లీలో మురికినీటి కాలువల్లో పూడిక తీయకపోవడంతో కాలువలు నిండి ఇళ్లలోని కాలువల ద్వారా లోనికి మురికి నీరు చేరుతోంది.

తీరని సమస్యలు



యూనియన్ బ్యాంకు ఎదుట వరద నీరు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో దీర్ఘకాలంగా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. మురికినీటి కాలువలు, రోడ్ల విస్తరణ, చౌరస్తాల ఆధునీకరణ ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నాయి. వర్షాకాలంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక రోడ్లపైన వరదనీరు నిలిచి వాహనదారులు, పురప్రజలు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది.

- బూడిదగడ్డ, ఎత్తివేతకు గురైన ఎక్స్‌ప్లోరేషన్ ముందు, పాత అగ్నిమాపక కేంద్రం, కాంటా చౌరస్తా కల్వర్టు వద్ద, కొత్తబస్టాండ్ చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై వరద నీరు నిలిచి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.
- బజారు ఏరియా యూనియన్ బ్యాంకు ముందు వరద నీరు నిలిచి ఉంటుండడంతో ప్రజలు తిప్పలు పడుతున్నారు. కాంటా చౌరస్తా నుంచి కొత్తబస్టాండ్ చౌరస్తా వరకు రోడ్డుకు ఇరువైపుల మురికి నీటి కాలువలు ఉన్నా ఆక్రమణకు గురై, సరైన నిర్వహణ లేక పూడిక నిండి ఆనవాళ్లు కోల్పోయాయి. దీంతో వరద నీరు రోడ్డుపై నిలిచి ఉంటోంది.
- భగత్‌సింగ్ చౌరస్తా నుంచి యూనియన్ బ్యాంకు ముందు నుంచి షంషీర్ నగర్‌కు వెళ్లే మార్గంలో మురికి కాలువలు లేకుండా ఉన్నాయి. సరిగ్గా బ్యాంకు ముందు మోకాలి బంటి లోతుగా మురికి నీరు స్థిరంగా నిలిచి ఉన్నా చర్యలు తీసుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం జరుగుతోంది.
- చౌరస్తాల విస్తరణ పూర్తిస్థాయిలో చేపట్టలేదు. మున్సిపల్ కార్యాలయం ముందు, పాత జీఎం కార్యాలయం క్రాస్‌రోడ్, కొత్త బస్టాండ్ ఏరియా, ఏఎంసీ ఏరియా చౌరస్తాలు వెడల్పు చేయాల్సి ఉన్నా అమలు కావడం లేదు. ఈ కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. భారీ వాహనాలు వెళ్లడానికి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నా మున్సిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. జంక్షన్లు ఉన్నా ఉపయోగకరంగా లేకపోవడం శాపంగా మారింది. ఆయా సమస్యలపై మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యను సంప్రదించగా నిధుల సమస్య తీవ్రంగా ఉందని, ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే ప్రతిపాదనలు చేసి పనులు చేపట్టడానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.

ఎన్నికలకు ఏర్పాట్లు!

- సిద్ధమవుతున్న జిల్లా అధికారులు
- శిక్షణ, సమావేశాలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండడంతో అటు రాజకీయ నాయకుల్లో హడావుడి పెరిగింది. మరోవైపు జిల్లాలో ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఆ మేరకు సిద్ధమవుతోంది. డిసెంబర్‌లోపు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ఎన్నికల ఉన్నతాధికారులతో జిల్లా కలెక్టర్లు, డీసీపీ, ఇతర అధికారులు పలు సమీక్షలు, సమావేశాల్లో పాల్గొంటున్నారు. కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఆర్డీవో స్థాయి అధికారులకు ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక సమావేశాలు, శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల రెండు రోజులపాటు జిల్లాలో అధికారులకు సమావేశాలు నిర్వహించారు. జిల్లాలోని మంచిర్యాల, చెన్నూరు, బెల్లంపల్లి, ఖానాపూర్(జన్నారం) నియోజకవర్గాల్లో ఉన్న ఓటర్ల జాబితా, మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాల జాబితా సిద్ధమవుతోంది. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా తదితర అంశాలపై సమావేశాలు నిర్వహించారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్(ఫైల్)

ఇప్పటికే జిల్లాలో ఓటర్ల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, మృతుల పేర్లు తొలగింపు జరిగాయి. కొత్త జాబితా సైతం సిద్ధమైంది. ఇంకా ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు ఓటర్ల తప్పొప్పులు సవరించుకునే అవకాశం కల్పించారు. జిల్లాలో గత మూడేళ్లుగా పని చేస్తున్న అధికారుల బదిలీల జాబితా సిద్ధం చేసి బదిలీలు చేస్తున్నారు. పోలీసు, రెవెన్యూ, తదితర శాఖల్లో అధికారుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఇటీవల జిల్లాకు ఈసీఐఎల్ సంస్థ నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్లు వచ్చాయి. వీటిని నస్పూర్‌లోని ఈవీఎం, వీవీప్యాట్ జిల్లా గోదాంలో భద్రపరిచారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, వికలాంగులు, వృద్ధులకు సౌకర్యాల కల్పన, కొత్త జాబితా ప్రకారం అవసరమైన చోట పోలింగ్ బూత్ ఏర్పాటుపై క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కొత్తగా ప్రవేశపెడుతున్న పలు సంస్కరణలపై అధికారులకు అవగాహన కల్పిస్తున్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై..

జిల్లాలో గతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు అనేకంగా ఉన్నాయి. వామపక్ష వాదం బలంగా ఉన్న పోలింగ్ కేంద్రాల్లో పలు ఎన్నికల సందర్భంగా ఘటనలు జరగకుండా ముందస్తుగా జాబితా సిద్ధం చేశారు. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దులు, అటవీ, మారుమూల ప్రాంతాల్లో ఉన్న పోలింగ్ కేంద్రాల వివరాలను పోలీసు అధికారులు సేకరించారు. జిల్లా పోలీసు అధికారులు సైతం పోలీసు బందోబస్తు, పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా వివరాలు సేకరిస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బందికి తగిన శిక్షణ, తదితర ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణపై టెలీ, వీడియో కాన్ఫరెన్సులు నిర్వహిస్తున్నారు.

మట్టి.. చీకటి దందా..!

- గోదావరి తీరంలో నుంచి గుట్టుగా తరలింపు
- పట్టించుకోని అధికారులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సాగు భూముల్లో నేల చదును పేరుతో జోరుగా మట్టి దందా సాగుతోంది. ఎటువంటి ప్రభుత్వ అనుమతులు, రాయల్టీ చెల్లించకుండానే రవాణా జరుగుతోంది. నస్పూర్ పట్టణ పరిధిలో సీతారాంపల్లి శివారు గోదావరి ఒడ్డున భూముల్లో నుంచి రాత్రివేళ మట్టి తరలిస్తున్నారు. పట్టా భూముల్లో చదును చేసేందుకు అని చెబుతూ అవసరం ఉన్న వారికి ఆ మట్టిని అమ్మేస్తున్నారు. రాత్రివేళల్లో జేసీబీతో స్థానిక ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఆదివారం రాత్రి ట్రాక్టర్లతో పట్టణంలో పలు చోట్లకు మట్టిని తరలించి విక్రయించారు. స్థానిక ట్రాక్టర్ల డ్రైవర్లు గుట్టుగా ఈ దందా చేస్తున్నారు. ఎవరైనా తమ సొంత పట్టా భూముల్లో మట్టి, మొరం, ఇసుక ఏదైనా తీయాలంటే గనుల శాఖ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. సొంత భూమిలోనే అక్కడిదక్కడే మట్టిని చదును చేస్తే ఎటువంటి అనుమతులు అవసరం లేదు. కానీ వేరే చోటుకు మట్టిని తీసి అమ్ముకుంటే తప్పనిసరిగా రాయల్టీ చెల్లించాలి. ఇవేమీ అనుమతులు తీసుకోకుండానే మట్టి తరలిస్తున్నారు. పగలు కంటే రాత్రి పూట ఎవరి కంట పడకుండా ఎక్కువగా తరలిపోతోంది. రాత్రివేళ నిబంధనల ప్రకారం ఎట్టి పరిస్థితుల్లో వాహనాల్లో మట్టి, ఇసుక వంటివి రవాణా చేయరాదు. ఇవేమీ పట్టించుకోకుండా రాత్రివేళ యంత్రాలతో తీస్తూ మట్టిని అవసరమైన చోట్లకు తరలిస్తున్నారు.



మట్టి తరలించడంతో ఏర్పడిన గుంతలు

అక్రమంగా ఇసుక దందా

నస్పూర్ పట్టణ పరిధిలో కొందరు యథేచ్ఛగా ఇసుక దందా సాగిస్తున్నారు. తెల్లవారు జామున, రాత్రివేళల్లో ఎటువంటి అనుమతి లేకుండా గోదావరి పుష్కర ఘాట్ పరిసర ప్రాంతాల్లో ట్రాక్టర్లతో ఇసుక తీసుకెళ్తున్నారు. గోదావరి నుంచి వేసవిలో కూలీలతో ట్రాక్టర్లతో ఇసుకను నింపి పలు చోట్లకు తెచ్చి అమ్మేస్తున్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పలు చోట్ల డంప్‌లు కూడా ఏర్పాటు చేసుకున్నారు. దీనిపై అటు పోలీసు, రెవెన్యూ, ఇటు గనుల శాఖ అధికారులు దృష్టి సారించకపోవడంతో అక్రమ దందా సాగుతూనే ఉంది.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- కలెక్టర్ బాదావత్ సంతోష్
- ప్రజల నుంచి అర్జీల స్వీకరణ

నస్పూర్: ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు వేణు, శ్యామలాదేవితో కలిసి సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ పలువురు కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాదావత్ సంతోష్

- రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు డి.కృష్ణ, ప్రధాన కార్యదర్శి బి.జగన్, సభ్యులు వినతిపత్రం సమర్పించారు.
- మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు ఖాతాల్లో జమ చేయాలని నస్పూర్ మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు కొయ్యల వెంకటి కోరారు.
- దండేపల్లి మండలం కాసిపేట గ్రామానికి చెందిన ఆవుల మౌనిక తాను దివ్యాంగుల పెన్షన్ పొందుతున్నానని, పింఛన్ రద్దుకు నోటీసులు జారీ చేశారని, అర్హత కలిగిన తనకు పింఛన్ అందించాలని కోరింది.
- జన్నారం మండలం గోండుగూడ గ్రామస్తులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల దాసు గ్రామస్తులతో కలిసి వినతిపత్రం సమర్పించారు.

ధరణి సమస్య తీర్చండి



నాకు జన్నారం మండలం చింతగూడెం గ్రామంలో 20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ధరణి సర్వే కంటే ముందు పహాణీలో అన్ని రికార్డుల్లో నా పేరు మీద ఉన్నది. భూమి నాదేనంటూ స్థానిక ఆర్ఐ, తహసీల్దార్లు ధ్రువీకరించారు. నేటికీ ధరణిలో నాపేరు మీద భూమి నమోదు కాలేదు. ఇప్పటివరకు 20మార్లకు పైన కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాను. ధరణి రికార్డులో నమోదు చేసి న్యాయం చేయండి.

– అజ్మీరా బద్రినాయక్, జన్నారం

గురుకులంలో అడ్మిషన్ ఇప్పించండి



మాది లక్సెట్టిపేట మండలం గుల్లకోట గ్రామం. చిన్నప్పుడే నా తండ్రి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. తల్లి మరో వివాహం చేసుకుంది. నానమ్మ వద్ద ఉండి ఐదో తరగతి వరకు చదివాను. నానమ్మ వృద్ధాప్యం వల్ల ఆమె వద్ద ఉండి చదువుకోలేకపోతున్నాను. లక్సెట్టిపేటలోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశం కల్పించాలి. మేనమామ డి.సందీప్‌తో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించాను.

– ఆవునూరి లోకేష్‌బాబు, గుల్లకోట

గ్రూపు 4 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- కలెక్టర్ బాదావత్ సంతోష్

నస్పూర్: గ్రూపు 4 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. సోమవారం ఆయన నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవనంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, ట్రెయినీ కలెక్టర్ పి.గౌతమి, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు వేణు, శ్యామలాదేవి, జిల్లా పంచాయితీ అధికారి వెంకటేశ్వర్‌రావులతో కలిసి గ్రూప్ 4 పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడతూ జిల్లాలో 94 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, 27,801 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు

నస్పూర్: జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఆబ్కారీ శాఖ ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ రవాణాకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి చిన్నయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

సికెల్ సెల్ నియంత్రణకు..

జిల్లాలో సికెల్ సెల్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సంతోష్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుబ్బరాయుడుతో కలిసి సికెల్ సెల్ నిర్వహణ పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కాసిపేట, మందమర్రి, దండేపల్లి, తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 18,436 మందికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతీ ఆరోగ్య కేంద్రం పరిధిలో మూడు బృందాలు ఏర్పాటు చేసి సోమ, మంగళ, గురు, శుక్రవారాల్లో పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లా ఆరోగ్య శాఖ ఉపవైద్యాధికారి డాక్టర్ ఫయాజ్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

– ఒకరి పరిస్థితి విషమం



చికిత్స పొందుతున్న కూలీలు

జన్నారం: మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన 40 మంది ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలు ఇలా ఉన్నాయి..సమీప అటవీ ప్రాంతంలో వందమంది కూలీలు సోమవారం ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. ఆ ప్రాంతంలో పొదలో తేనెటీగలు తెట్టె పెట్టాయి. గమనించకుండా బండరాళ్లను పొదలో వేయడంతో తేనెటీగలు ఒక్కసారిగా కూలీలపై దాడి చేసి కుట్టాయి. కొందరు పరుగులు తీశారు. గాయపడినవారిని సర్పంచ్ జాడి గంగాధర్ తాళ్లపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు వారికి ప్రథమ చికిత్స చేశారు. వంద చోట్ల తేనెటీగలు కుట్టడంతో దేవ లింగన్న పరిస్థితి విషమించడంతో మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. మిగతా కూలీలు చికిత్స అనంతరం ఇళ్లకు వెళ్లారు.

30న జాబ్‌మేళా

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతి, యువకుల కోసం ఉట్నూర్‌లోని యూత్ ట్రైనింగ్ శిక్షణ కేంద్రంలో ఈనెల 30న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ మేళా ఉంటుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీస్, బయోఆర్గానిక్, ఫ్లిప్‌కార్ట్, క్రీమ్‌స్టోన్, మెడ్‌ప్లస్ కంపెనీల్లో 325 ఉద్యోగాలకు ఎంపిక ఉంటుందని వివరించారు. మేళాలో పాల్గొనేవారు 18–35 ఏళ్లలోపు ఉండాలని పేర్కొన్నారు. బయోడేటా, విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాల జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 78936 16392 సెల్‌నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ



ఉన్నతాధికారులతో విజేతలు

ఆసిఫాబాద్/కౌటాల: తెలంగాణ స్టేట్ 9వ షూటింగ్ చాంపియన్ షిప్ 2023–24 పోటీల్లో కౌటాల పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ బి.స్రవంతి ప్రతిభ కనబర్చింది. ఈ పోటీల్లో 10 ఎం.ఎయిర్ పిస్టల్ పోటీల్లో రజత పతకం సాధించి విజేతగా నిలిచింది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలను డీజీపీ అంజనీకుమార్ మెడల్స్ అందజేశారు. స్రవంతి విజేతగా నిలవడం జిల్లాకే గర్వకారణమని ఎస్పీ సురేశ్‌కుమార్, కౌటాల సీఐ సాధిక్ పాషా తెలిపారు.

కొయ్య కొరత తీర్చేలా..



పొనికి కర్రతో నిర్మల్ బొమ్మలు తయారు చేస్తున్న కళాకారులు

- నిర్మల్ జిల్లాలో పొనికి వనాల పెంపకానికి చర్యలు
- అనువైన స్థలాలు గుర్తింపు
- హరితహారంలో మొక్కలు నాటేలా చర్యలు
- బొమ్మల తయారీకి ఊతమిచ్చేలా..



అడవుల్లో సహజసిద్ధంగా పెరిగే పొనికి చెట్టు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ అనగానే మొదట గుర్తొచ్చేది కొయ్యబొమ్మలే..వీటి తయారీ పరిశ్రమ కొలువుదీరింది ఇక్కడే. పొనికి చెట్టు నుంచి తీసే కలప ముడిసరుకుతో ఈ బొమ్మలను కళాకారులు తయారు చేస్తారు. ఈ కర్ర మృదువుగా, తేలికగా ఉపయోగించవచ్చు. ప్రస్తుతం అడవుల్లో పొనికి చెట్లు కనుమరుగవడంతో జిల్లాలో గత ఐదారేళ్లుగా బొమ్మల తయారీ పరిశ్రమ తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటోంది. దాదాపు 150 కళాకారుల కుటుంబాలు ఈ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పొనికి మొక్కల పెంపకానికి చర్యలు చేపట్టింది. ఈ మేరకు మొక్కల పెంపకానికి అనువైన ప్రాంతాలను అధికారులు గుర్తించారు. హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా సంరక్షణ చర్యలు చేపడుతున్నారు.

పొనికి మొక్కల పెంపునకు అనువైన ప్రాంతాలు..

పొనికి మొక్కల పెంపకం కోసం ప్రయోగాత్మకంగా పలు గ్రామ పంచాయతీలను డీఆర్డీఏ, ఇతర అధికారులు ఎంపిక చేశారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా మామడ మండలం కొరిటికల్, గాయిద్‌పెల్లి, మొండిగుట్ట, తాండ్ర, వాస్తాపూర్, లింగాపూర్, తోటిగూడ, రాయదారి, సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ సమీపంలోని అటవీప్రాంతం అనువైనవిగా గుర్తించారు. ఇప్పటికే మట్టికి భూసార పరీక్ష అనంతరం ఇక్కడ మొక్కలు నాటి సంరక్షిస్తున్నారు. రాయదారి సమీపంలో 500 మొక్కలు నాటారు. మొదటగా లింగాపూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో హరితహారం కింద వెయ్యి పొనికి మొక్కలు నాటారు. వాస్తాపూర్, గాయిద్‌పెల్లి తదితర గ్రామాల్లో దశలవారీగా మొక్కల పెంపకం చేపట్టనున్నారు. సారంగాపూర్ మండలం గోపాల్‌పేట సమీపంలో మహబూబ్ ఘాట్స్ ప్రాంతంలో 2,200 మొక్కలు నాటారు. నీటి వసతి కోసం ప్రత్యేకంగా డీఆర్డీఏ అధికారులు బోర్‌వెల్ వేయించారు.



మామడ మండలంలో పొనికి మొక్కలు నాటుతున్న అధికారులు

పొనికి కర్ర ప్రత్యేకం..

నిర్మల్ కొయ్యబొమ్మల తయారీకి ఉపయోగించే పొనికి చెట్టు నుంచి తీసిన కలప చాలా ప్రత్యేకం. ఎందుకంటే ఈ పొనికి కర్ర తేలికగా సరళంగా ఉండి, బొమ్మను చెక్కే క్రమంలో మృదువుగా ఉంటుంది. బొమ్మల తయారీలో కళాఖండంగా తీర్చుదిద్దవచ్చు. అందుకే పొనికి కర్రను వినియోగిస్తామని కళాకారులు అంటున్నారు.

మొక్కలు నాటించాం



పొనికి కర్రకు తీవ్రమైన కొరత ఏర్పడిన విషయాన్ని గుర్తించాం. జిల్లా కలెక్టర్ ప్రోత్సాహంతో హరితహారంలో మొక్కల ప్లాంటేషన్‌ను పకడ్బందీగా చేపడుతున్నాం. కొన్ని ప్రాంతాలను గుర్తించి మొక్కలు నాటించాం. సంరక్షణ చర్యలు తీసుకుంటున్నాం.
– కె.విజయలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి

హర్షణీయం



పొనికి కలపతో తయారీ చేసిన కొయ్య బొమ్మలు ఎక్కువకాలం మన్నిక ఉంటాయి. వీటి తయారీపై ఆధారపడిన కళాకారుల కుటుంబాలు కర్ర కొరతతో ఇబ్బంది పడ్డాం. రాష్ట్ర ప్రభుత్వం, డీఆర్డీఏ అధికారులు జిల్లాలో పొనికి వనాల పెంపకం చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయం.
– నాంపల్లి రాజశేఖర్‌వర్మ, కళాకారుడు, నిర్మల్

ఆర్టీఏలో వరుస దావత్‌ల జోరు

- అధికారులు, సిబ్బంది, ఏజెంట్ల తీరు
- రాష్ట్రస్థాయిలో ఘనత సాధించామంటూ పార్టీ
- ఆషాఢం అంటూ మరోసారి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల ఆర్టీఏ కార్యాలయం వరుస దావత్‌లతో వార్తల్లోకెక్కుతోంది. రాష్ట్ర స్థాయిలో జిల్లా అగ్రస్థానంలో ఉందని మొన్న.. ఆషాఢం కదా అని నిన్న దారి మైసమ్మ పేరుతో మేకను కోసి విందు చేసుకోవడం చర్చనీయాంశమైంది. జిల్లా రవాణా శాఖ ప్రభుత్వం విధించిన పన్నుల వసూళ్ల లక్ష్యాన్ని చేరుకుని రాష్ట్ర స్థాయిలో 3వ స్థానం సాధించింది. త్రైమాసిక, జీవితకాలం, ఫీజులు, సేవల పన్ను, తనిఖీలు, జరిమానాలతో ఏడాదిలో ఏకంగా రూ.61.24 కోట్లు వసూళ్లు చేసింది. దీంతో రవాణా శాఖ కమిషనర్, మంత్రి ద్వారా ప్రత్యేకంగా ప్రశంసలు అందుకున్నారు. ఈ ఆనందంలో విందుకు జిల్లా కేంద్రంలోని నడిబొడ్డున ఓ ఏసీ ఫంక్షన్ హాల్ వేదికైంది. ఈ నెల 15న జరిగిన కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారితోపాటు ఎంవీఐలు, ఏఓ, కార్యాలయ సిబ్బంది ఒకరికొకరు సన్మానించుకున్నారు. ఈ సభలో ఇక ముఖ్య అతిథులుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్టీఏ ఏజెంట్లు భాగస్వామ్యం అయ్యారు. వీరి కనుసన్నల్లోనే సన్మాన కార్యక్రమం విజయవంతంగా సాగింది. అక్కడే ఏర్పాటు చేసిన మందు, విందులో మునిగితేలారు.

తాజాగా ఆషాఢం.. ఆదివారం..

తాజాగా మరోసారి ఆర్టీఏ అధికారులు, సిబ్బందితోపాటు ఏజెంట్లు మిలాఖత్ కావడంతో ఈసారి వీరికి తోడుగా మరికొంత మంది తోడయ్యారు. ఇంకేముంది ఆషాఢం.. ఆపై ఆదివారం.. అంతా కలిసి ఆర్టీఏ కార్యాలయానికి ఓ మేకను మొక్కి బలిచ్చారు. మేక మాంసం పోగులను కూర వండేందుకు ఉపక్రమించారు. ఆర్టీఓ కార్యాలయ ఆవరణలోని టెస్ట్ ట్రాకింగ్ షెడ్ వద్ద ఉన్న రేకుల షెడ్‌లో వంటలు చేశారు. అక్కడ కార్యాలయ ప్రధాన ద్వారం ఎదురుగా ఉన్న ఓ చెట్టు నీడలో అంతా కలిసి మందు సేవించారు. ఆ మత్తులోనే పేకాటలో నిగ్నమయ్యారు. ఆర్టీఏ సిబ్బందితోపాటు ఏజెంట్లు కలిసి మందు, విందు చేసుకోవడంపై పలువురు ఇదేం చోద్యం అంటున్నారు. ఆర్టీఏ కార్యాలయ ఆవరణలో జరిగిన దావత్‌పై పూర్తి స్థాయి విచారణ మేరకు చర్యలు తీసుకుంటామని డీటీఓ కిష్టయ్య తెలిపారు.

ఒకే రోజు ఐదుచోట్ల చోరీలకు యత్నం

- వాచ్ రిపేరింగ్ షాపులో రూ.5 వేల అపహరణ
- కాగజ్‌నగర్‌లో ఘటన

కాగజ్‌నగర్‌టౌన్: ఒకరోజు ఐదుచోట్ల దుండగులు చోరీలకు యత్నించారు. పట్టణంలోని ఆదివారం రాత్రి ఈ ఘటనలు చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..రాజీవ్‌గాంధీ చౌరస్తాలోని ఇండియన్ ఏటీఎం తలుపు తాళం పగులగొట్టి దుండగులు డబ్బులు చోరీకి యత్నించి విఫలమయ్యారు. సమీపంలోని ఓ పండ్ల బండి తాళాన్ని పగులగొట్టగా నగదు దొరకలేదు. మహాలక్ష్మి హోటల్‌లో ప్రవేశించి వస్తువులన్నీ పడేశారు. సాయిబు స్టాల్ షట్టర్ ఇరువైపులా తాళాలను పగలగొట్టి లోనికి జొరబడేందుకు విఫలయత్నం చేశారు. షటర్ లాక్ ఓపెన్‌కాకపోవడంతో వెనుదిరిగారు. అదేవిధంగా వాచ్ రిపేరింగ్ షాపు నుంచి రూ.5వేల నగదును ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం యజమానులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.




వాచ్ సెంటర్‌లో చిందరవందరగా సామగ్రి

'విందులు వద్దనడం సరికాదు'

శ్రీరాంపూర్: గనులపై కార్మికులు విందులు వద్దనడం సరికాదని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు ఎస్‌కే బాజీసైదా, కె.వీరభద్రయ్య ఓ ప్రకటనలో తెలిపారు. విందులు వద్దంటూ ఇటీవల యజమాన్యం విడుదల చేసిన ఉత్తర్వులను తీవ్రంగా ఖండిస్తున్నామని, వీటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులు రిటైర్డ్ అయిన సందర్భంలోనూ, ప్రమాదాలు జరగకూడదని మైసమ్మకు మొక్కుకునే సందర్భంలో విందులు చేసుకోవడం ఆనవాయితీ పేర్కొన్నారు. ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని బీఎంఎస్ ఏరియా కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు.

చిరుత దాడిలో లేగదూడ మృతి



పరిశీలిస్తున్న ఫారెస్టు అధికారులు

తిర్యాణి: మండలంలోని గిన్నెధరి రేంజ్ పరిధిలోని మందగూడ అటవీ ప్రాంతంలో లేగదూడపై చిరుత దాడి చేసి హతమార్చింది. ఫారెస్టు సెక్షన్ అధికారి శ్రీనివాస్ కథనం ప్రకారం.. ఆదివారం సాయంత్రం మందగూడ శివారులోని అటవీ ప్రాంతంలో నైతం లక్ష్మణ్‌కు చెందిన లేగదూడపై చిరుత దాడి చేసి చంపింది. కాగా, ఆ ప్రాంతాన్ని ఫారెస్టు అధికారులు సోమవారం పరిశీలించారు. చిరుత ఆనవాళ్లు లభించలేదని, సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సెక్షన్, బీట్ అధికారులు శ్రీనివాస్, సూర్యరావు, అవినాష్, సురేశ్ ఉన్నారు.

మద్యం బాటిళ్ల ధ్వంసం కేసులో మహిళకు జైలు

మందమర్రిరూరల్: పట్టణంలోని పలు కిరాణా దుకాణాల్లో బెల్ట్ షాపులు నిర్వహించడంతో నిందితురాలు రామిళ్ల రాధిక అందులో జొరబడి మద్యం బాటిళ్లు ధ్వంసం చేశారనే కేసులో ఆమెకు 14 రోజుల జైలుశిక్ష విధిస్తూ జిల్లా ఫస్ట్ అడిషనల్ కోర్టు జడ్జి ఉపనిషథ్‌వాణి సోమవారం తీర్పునిచ్చారు. ఆమెను ఆదిలాబాద్ జిల్లా జైలుకు తరలించినట్లు ఎస్సై చంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం బాటిళ్ల ధ్వంసం చేయడంతో రాధికపై శుక్రవారం కేసు నమోదు చేశామన్నారు. శనివారం రాధికతోపాటు బత్తుల సరితను కోర్టుకు తరలిస్తుండగా రాధికకు అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారు. పరీక్ష అనంతరం సోమవారం కోర్టులో హాజరుపర్చగా, జడ్జి ఈ మేరకు తీర్పు వెలువరించారు. కాగా, రెండు రోజుల క్రితం సరితకు 14 రోజుల జైలుశిక్ష విధించగా, ఆసిఫాబాద్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

కన్నబిడ్డను చూడకుండానే..

- మూర్ఛవ్యాధితో బాలింత మృతి
- ఐసీయూలో చికిత్స పొందుతున్న పసికందు
- ఏడాది క్రితమే ప్రేమ వివాహం
- కెరమెరి మండలం సావర్‌ఖేడాలో విషాదం



రంజిత(ఫైల్)

కెరమెరి(ఆసిఫాబాద్): కన్నబిడ్డకు గోరుముద్దలు తినిపించాలని..ప్రేమగా లాలించాలని, చందమామను చూపిస్తూ ఊరించాలని.. ఎన్నో కలలు కన్న ఆ మాతృమూర్తి బిడ్డను చూడకుండానే కన్నుమూసింది. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన రంజిత(21) మూర్ఛ వ్యాధితో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మండలంలోని సావర్‌ఖెడాలో విషాదం చోటుచేసుకుంది.కుటుంబీకులు తెలిపిన వివరాలు.. సావరఖెడా గ్రామానికి చెందిన మహండోరే సోనాజి, తానుబాయిల దంపతుల కూతురు రంజితను రాంనగర్ గ్రామానికి చెందిన వసాకే శ్రీనివాస్‌తో గతేడాది వివాహం చేశారు. ఈ నేపథ్యంలో రంజిత గర్భిణికావడంతో నెల క్రితం తల్లిగారింటికి(సావర్‌ఖెడా)కు వచ్చింది. ఆమెకు సోమవారం ఫిట్స్ వచ్చాయి. తల్లిదండ్రులు వెంటనే ఆసిఫాబా ద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు మంచిర్యాలలోని ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడ సిజేరియన్ చేయడంతో పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. చికిత్స పొందుతున్న ఆమె ఒక్కసారిగా ఫిట్స్(మూర్ఛ) రావడంతో మృతిచెందింది. ప్రస్తుతం బిడ్డ ఐసీయూలో చికిత్స పొందుతోంది. కాగా, శ్రీనివాస్, రంజిత ఏడేళ్లుగా ప్రేమించుకున్నారు. ఇరు కుటుంబ సభ్యులు వీరి పెళ్లికి ససేమిరా అన్నారు. తర్వాత తల్లిదండ్రుల ను ఒ ప్పించి పెళ్లి చేసుకున్నారు. ఎంతో ప్రేమగా..అన్యోన్యంగా ఉన్న ఆ దంపతులపై విధి కన్ను కుట్టింది. రంజిత మృతితో భర్త శ్రీనివాస్, ఇరువురి కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి.

టూటౌన్‌కు రైల్వే ఫుట్ ఓవర్‌బ్రిడ్జి నిర్మించాలి



ప్రచారం చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని టూటౌన్ ప్రజల సౌకర్యార్థం హమాలీవాడ రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీనివాస థియేటర్ ఏరియాలో సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనపై మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు రైల్వే శాఖ సిద్ధంగా ఉన్నప్పటికీ, మంచిర్యాల మున్సిపాలిటీ సిద్ధంగా లేదని, మున్సిపల్ పాలకవర్గం రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించేలా ఏదైనా నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, పెద్దపల్లి పురుషోత్తం జాజు, బోయిని హరికృష్ణ, గాజుల ప్రభాకర్, ముదాం మల్లేశ్, జోగుల శ్రీదేవి, బొద్దున మల్లేశ్, పట్టి వెంకటకృష్ణ, బండి మల్లికార్జున్, పల్లి రాకేశ్, రెడ్డిమల్ల అశోక్, కంకణాల సతీశ్, శివ, చక్రి పాల్గొన్నారు.

బొగ్గు నాణ్యత పాటించాలి

- జీఎం సూర్యనారాయణ

శ్రీరాంపూర్: బొగ్గు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సింగరేణి మార్కెటింగ్ జనరల్ మేనేజర్ కె.సూర్యనారాయణ తెలిపారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియా జీఎంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మంచి గ్రేడ్ బొగ్గును ఉత్పత్తి చేయాలని అప్పుడే వినియోగదారుల మన్ననలు చూరగొంటామని అన్నారు. దీనికోసం ఏర్పాట్లు చేయాలన్నారు. సీహెచ్‌పీ వద్ద బొగ్గు నాణ్యత చెడిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్, ఇందారం ఓసీ ప్రాజెక్టు అధికారి ఎం.శ్రీనివాస్, ఏజెంట్లు ఏవి రెడ్డి, రాముడు, మేనేజర్లు అబ్దుల్ ఖాదర్, సంతోష్ కుమార్, సాయిప్రసాద్, విజయ్‌కుమార్, సుధీర్ జక్కులవార్, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, సీనియర్ ఐటీ ప్రోగ్రామర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీటీఎస్‌పై సమీక్ష..

వెహికిల్ ట్రాకింగ్ సిస్టం(వీటీసీఎస్) పనితీరుపై డైరెక్టర్(పర్సనల్, ఫైనాన్స్)ఎన్.బలరాం సమీక్ష సమావేశం నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా జరిగిన సమావేశంలో ఏరియా నుంచి జీఎం సంజీవరెడ్డి పాల్గొన్నారు. వీటీఎస్ పనితీరు మరింత మెరుగుపర్చుకోవాలన్నారు. బొగ్గు రవాణా సరైన రీతిలో జరుగడానికి ఇది చక్కగా ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో ఏరియా జీఎం సంజీవ రెడ్డి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏరియా జీఎం సంజీవరెడ్డి

జీఎంను కలిసిన సిక్కా కమిటీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ డివిజన్‌లో నూతనంగా ఎన్నికైన సింగరేణి కాలరీస్ క్లరికల్ అసోసియేషన్ (సిక్కా) కమిటీ సభ్యులు జీఎం బి.సంజీవరెడ్డిని కలిశారు. సిక్కా కేంద్ర కమిటీ అధ్యక్షుడు బొల్లం మధు మోహన్, ప్రధాన కార్యదర్శి వై.సారంగపాణి, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు ముస్కె సమ్మయ్య, దుర్గాప్రసాద్‌లు ఇటీవల ఎన్నికైన శ్రీరాంపూర్ నూతన కమిటీని జీఎం పరిచయం చేశారు. ఈ సందర్భంగా క్లర్కుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఏరియాలోని అన్ని గనులు, డిపార్టుమెంట్లపై అధికారులకు సిక్కా తరపున రిప్రజెంటేషన్ చేయడానికి అనుమతించాలని రాష్ట్ర కమిటీ నాయకులు జీఎంను కోరారు. ఈ సందర్భంగా ఏరియా స్టోర్‌లో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేయాలని అక్కడి క్లర్కులపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. సంబంధం లేని పని చేయాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. సమావేశంలో సిక్కా ఏరియా ఉపాధ్యక్షుడు కన్నం సాంబయ్య, ఫైనాన్స్ కార్యదర్శి జిల్లాల రవి, జాయింట్ సెక్రెటరీలు బదిరి బుచ్చయ్య, గంట విజయలక్ష్మి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు సుద్దాల శ్రావణ్ కుమార్, నిర్మలాదేవి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు లింగం నాగలక్ష్మి, నవీన్‌కుమార్, మహేష్, కందుకూరి సురేష్, శివశంకర్, సుద్దుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జీఎంకు నూతన కమిటీ వివరాలు అందజేస్తున్న సభ్యులు

అద్దె వాహనాల ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి

జైపూర్: జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు భూనిర్వాసిత అద్దె వాహనాల ఓనర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్టీపీపీ జీఎం సూర్యనారాయణరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అన్ని ఏరియాల్లో భూనిర్వాసతులైన అద్దె వాహనాల ఓనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఏరియాల వారీగా వినతిపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. 2017 నుంచి యూనిట్ రేటు పెంచడం లేదని, మూడేళ్ల కాలపరిమితిని ఆరేళ్లకు పెంచాలని వినతిలో కోరారు. పెండింగ్‌లో ఉన్న డ్రైవర్ల ఈపీఎఫ్‌లు విడుదల చేయడంతోపాటు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీఎంకు అందజేశారు. సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే నెల 6 నుంచి సింగరేణి వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని ఎస్టీపీపీ భూనిర్వాసిత అద్దె వాహనాల ఓనర్ల గౌరవ అధ్యక్షుడు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, అధ్యక్షుడు రామటెంకి తిరుపతి హెచ్చరించారు.



జీఎం సూర్యనారాణరాజుకు వినతిపత్రం ఇస్తున్న అద్దెవాహనాల యూనియన్ నాయకులు

అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీలో సీఓఈ విద్యార్థికి సీటు

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీఓఈ) బెల్లంపల్లి కళాశాల విద్యార్థి ప్రతిష్టాత్మక అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీలో సీటు సాధించాడు. సీఓఈలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసుకున్న మల్లెపూల సాయితేజ బెంగళూరులోని అజీమ్ ప్రేమ్ జీ యూనివర్సిటీలో ప్రవేశం కోసం పరీక్ష రాశాడు. రాతపరీక్ష ఆన్‌లైన్‌లో నిర్వహించిన మౌఖిక పరీక్షలో నైపుణ్యత కనబర్చడంతో సీటు వరించింది. సాయితేజ..అండర్ గ్రాడ్యుయేషన్ బీఎస్సీ బీఎడ్ సీటు దక్కించుకుని ప్రతిభ చాటుకున్నట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. సాయితేజతోపాటు సీఓఈలో చదివిన తాటి సాయి, సునార్కర్ అఖిలేశ్వర్ కూడా సీట్లు సాధించినట్లు వివరించారు. కష్టపడే తత్వం, పట్టుదల ఉంటే ఏ యూనివర్సిటీలోనైనా సీటు సాధించవచ్చని సీఓఈ విద్యార్థులు నిరూపిస్తున్నారని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఆర్‌సీవో స్వరూపరాణి సోమవారం ప్రశంసించారు.



సాయితేజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సైదులు